కథా నిలయం
శ్రీకాకుళం

# నియంతృత్వం

బాబూరావింటికి నేనెప్పుడో కాని వెళ్ళడం పడదు. ఆవేళ ప్రతాపరెడ్డిగారి 'ఆంధ్రుల సాంఘికచరిత్ర' వాడు కొన్నాడని తెలియగా అది ఓ సారి పుచ్చుకోవాలని వాళ్ళింటికి బయలుదేరా. తీరా వాడింటికి వెళ్ళేసరికి తలుపులు దగ్గఱగా వేసేసిఉన్నాయి. వాడింట్లో లేడేమో అనుకున్నా. అయినా ఇంట్లో కనుక్కొని పోదామని, తలుపు దగ్గఱగా వెళ్ళి కేక వేసే సమయంలో—

'ఛీ. నోరుమయ్' అన్నముక్క విన్నా.

విన్నవెంటనే గాజుల గలగల, ఉన్న స్థానంలోంచి ఎవ్వరో కదలి వెళ్ళిన సవ్వడి అయింది. నా మనస్సు ఆశ్చర్యంలో మునిగిపోయింది. ఎవరా ముక్క అన్నది? బాబూరావు అర్థాంగేనా? ఛీ. ఉత్తది. నేను పొరపాటుగా విన్నానా? బాబూరావే ఆ మాటలు అన్నాడేమో! అప్పుడామె అక్కడనుంచి వెళ్ళిపోయింది కాబోలు.

తరువాత అంతా నిశ్శబ్దం. గచ్చుమీద ఒలికినపాలు దుమ్మును కలుపుకొని సవ్వడి లేకుండా ప్రాకుతూన్నట్లుంది! అసలు ఇలాంటి సమయంలో వాణ్ని పిలవాలో పిలవగూడదో నా కర్థంకాలేదు.

నే నెప్పుడు వాడింటికి వెళ్ళినా గట్టిగా వాడి పేరుపెట్టి అరచేవాణ్ని. కాని ఆ వేళ, "బాబూరావ్, బాబూరావ్" అని మెల్లగా పిలిచాను. అయితే బాబూరావు వెంటనే వచ్చి తలుపు తీయలేదు. పోనీ పలకనూలేదు. వాడు రావటానికి రెండు నిమషాలు ఆలస్యం అయింది. వచ్చి తలుపు తీసిన వెంటనే, 'ఏం ఇలావచ్చావ్' అని విసుగుతో అడుగుతూన్నట్టుగా వుంది వాడి ముఖారవిందం. కాని వాడట్లా అనలేదు.

'రారా. ఏమిటివిశేషాలు. ఈ మధ్యరావటం మానేశావు' అన్నాడు. నాకు మతి పోయింది. వాడిమాటలు నేను సరిగ్గా వినేస్థితిలో లేను. నా మనస్సు 'ఛీ. నోరుముయ్' అన్న ముక్క మీదే పనిచేస్తూంది. అది బాబూరావు కంఠమా? లేక అతని అర్థాంగిదా?

ఆ మాట ఈ మాట అయిన తరువాత, 'నువ్వు ఆంధ్రుల చరిత్ర కొన్నావటగా. ఏదీ ఆపుస్తకం' అన్నా. ఒక్కసారిగా వాడు నిరుత్తరుడై పోయాడు. అయితే నేనన్న ముక్కల్లో ఏ పదంమీద వాడి మనసు పనిచేసిందో కాని

వాడి చూపులు ఎందుకనో లోని గుమ్మంవైపు ప్రసరించాయి. ఆతని ముఖం ఈ శబ్ద జాలం ఎంత వరకూ ప్రయాణం చేయ గలదో పరీక్షిస్తున్నట్లుంది! అయితే ఈ విషయం నాకప్పుడు తెలియలేదు. వాడు నాకు పుస్తకం ఇచ్చాడు. నేను అక్కడ నుంచి వెళ్ళిపోయాను.

ఇంటికి చేరుకున్నానే గాని నామనసు మనసులో లేదు. అది ఎక్కడెక్కడికో వెళుతూంది. ఏదో వెదుకుతూంది. దేనికో కారణాలు వివరించమంటూంది. అనేకరకాలుగా తర్కి స్తూంది. చాలారకాలుగా యోచిస్తూంది. నిజానికి ఈ మనసు ఉన్నదే బహు చెడ్డది! అది ఇతరుల చెడ్డను గుఱించి తెగ తెలుసుకోమని చంపుతుంది. పీక్కు తినేస్తుంది. పోనీ ఇందులో పెద్ద తప్పేముంది? మగవాడామాటను ఓ స్త్రీని ఉద్దేశించి అంటే సహించి ఊరుకోగల స్తోమతు ఉన్న నేను—ఓ స్త్రీ, ఎంతో కలసి మెలసి తిరిగే స్నేహితురాలు, సాక్షాత్తు భార్య: ఆ మాటను—అనేక సంవత్సరాలు అతిసాన్నిహిత్యంతో కూడు కున్న హృదయంతో భర్తచేసిన ఏ పెద్ద తప్పునో అట్లా నిర సిస్తే మధ్య ఏమీ సంబంధంలేని పరాయిపురుగునైన నేను, ఇంతబాధలో తపించిపోవడమేమిటీ! నిజంగా స్టుపిడిటీ. ఎంత కైనా మగజాతి మగజాతే! తన జాతిమీద ఈగనైన వ్రాల నీయదు. పాపం నిత్యం మగవాళ్ళనే ఇలాంటి మాటలతో ఆడవాళ్ళెంత కుళ్ళి కృశించి పోతున్నారో ఒక్కసారైనా ఊహించానా ?

ఇంతలో మా ఆవిడ భోజనానికి లెమ్మంది. అయితే ఆమె లెమ్మన్న వెంటనే నేను లేస్తానా ఏమిటి! అప్పుడు నా గొప్ప తనం ఏముంది? నే నింకా దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్నాను. ఆమె ఫస్టుబెల్ సెకండ్ బెల్ అన్నట్టుగా మళ్ళీ కేకేసింది. నాకు చికాకెత్తింది. దానితో 'ఛీ. నోరుముయ్' అన్నా. అలా అన్న తరువాత నాకు నవ్వొచ్చింది. నా నవ్వు చూసి ఆమె మూతిముడిచింది. ఇది చూసి నాకు దీర్ఘంగా ఆపుకోలేని నవ్వు వచ్చింది. ఇది చూసి ఆమె తన మూతి విరిచింది. ఆవిరుపు చూడగానే 'ఎందుకే భామా! అట్లా మూతి నస్తమానూ విరుస్తావు! అలా అస్తమానూ విరిస్తే కొన్నాళ్ళ కక్కడ పెళుసెక్కి విరిగ పోగలదు!' అన్నా. ఈసారి ఆమె సుమనోహరమైన నవ్వు సన్నగా ప్రకటించకుండా ఉండలేక పోయింది.

నేను భోజనం దగ్గఱ కూర్చుని 'అయితే ఆ వేళ ఇందిర దగ్గఱకు వెళ్ళావు కదా—మరి ఆమె ఏమి మాట్లాడిందో నాకొక్క విషయమూ చెప్పావుగాదేం? అన్నా; బాబూరావు భార్యామణి నుద్దేశించి. మా ఆవిడ ఇప్పుడావిడ సంగ తెందుకూ మీకు అంది. 'అబ్బే! ఊరకనే' అనేసి ఊరుకున్నా. చెబితే చెప్పు, లేకపోతే మానేసెయ్ అన్నట్టు అలా అనకపోతే ఆమె చేత వాగించడం బహుకష్టం లెండి!

ఇక ఆమె చెప్పడం ఆరంభించింది.

మొట్టమొదటగా, 'ఇందిర ఎంతమంచి దనుకున్నారు' అంది. నా హృదయంలో కళుక్కుమంది. అయినా వినక తప్పిందికాదు. 'ఆ వేళ వాళ్ళింటికి వెళ్ళగానే ఎంత మర్యాద చేసిం దనుకున్నారు. ఫలహారాలు చేసి పెట్టింది. కాఫీ ఇచ్చింది. ఏవేవో విషయాలు బోలెడన్ని చెప్పింది. పాపం! వాళ్ళాయన సినిమాలకు పుస్తకాలకు తెగ తగలేస్తూ ఉంటాడట. డబ్బు కూడ ఎవరికి బడితే వాళ్ళకు అప్పుగా ఇచ్చేస్తూ ఉండటమో, దానాలుచేసేస్తూ ఉండటమో చేస్తూఉంటాడట! ఇలాగుంటే ఎలాగండీ మరి? అదేమైనా సంసారమా ఇంకేమైనానా? ఇవ్వాళ ఉందికదా అని ఊరికా కళ్ళుమూసుకొని ఖర్చు పెట్టేస్తూ వుంటే— ముందుగతి కానొద్దటండీ! ఇదంతా చెప్పి ఆమె ఎంత బాధ పడిందనుకున్నారు. ఆమె అంతా మంచిదే కాని కోపంవస్తే మాత్రం మనిషి కాదండీ! ఆ వేళ వాళ్ళ పిల్లాడ్ని ఎంత గట్టిగా కొట్టిం దనుకొన్నారు ఆడుకుంటూ కుళ్ళు కాలువలో బంతిని పారేశాడని. ఎంతగట్టిగా కొట్టిందో చెప్పలేను! వాడు ఒకటే ఏడ్పు. ఇంతకోపం ఉంటే ఎలా కాపురం చేస్తుందండీ? ఏమీ ఎరుగని పసిపిల్లాడ్ని బాదుకుంటే ఏమొస్తుందీ!' అంటూ మా ఆవిడ ప్రక్కింటావిడ ఎందుకో పిలిస్తే, ఆ ప్రసంగం అక్కడితో కట్టిపెట్టి, ఆమెను కలుసుకోవడానికి వెళ్ళిపోయింది. ఆతరువాత మళ్ళీ ఈ ప్రసంగం మా మధ్య రాలేదు.

నిజానికి బాబూరా వద్భుతమైన సౌందర్యమూర్తి. ఇందిర అందాలరాణి. ఇట్లాంటి జంట కుదరడం చాల అరుదు. వాళ్ళు చక్కగా ముస్తాబై సినిమాకు పోతూవుంటే—వాళ్ళ ముందునుంచి పోయేవాళ్ళు అప్పటివరకూ చూసింది చాలక, వాళ్ళను దాటిన తరువాతకూడ, కళ్ళు వెనక్కీ కాళ్ళు ముందుకీ పోనిస్తూ ప్రాణాల్ని సైతం లెఖ్ఖచెయ్యరు!

బాబూరా వెంత అందమైనవాడో అంత ఠీవిగా ఉంటాడు. అతని కంఠస్వరం విన్నవాడు, భార్యతో ఇట్లాంటి మాట అనిపించుకుంటాడని కలలోకూడ అనుకోడు. మాఆవిడ చెప్పినదాన్నిబట్టి ఎంతాలోచించినా బాబూరావు భార్య మాట వినేవాడిలా కనుపించడంలేదు. ఆమెకు నిజంగా లొంగినవాడైతే ఆమె వద్దంటున్నా అట్లాంటి పను లెందుకు చేస్తాడు? అయితే ఆవేళ పుస్తకం ఇచ్చేప్పుడు అట్లా చూశేడేమిటి? అప్పటికి జరిగినమాటలమీదే నిలచిన ఆతని మనస్సు ఆమాటలమీదే పనిచేస్తూ అటువైపు చూపు నిలపిందేమో! ఏమైనా వాడట్లాంటి మాటలు పడే మనిషి మాత్రం కాడు. ఎంచేతనో నా హృదయం ఈ విషయం ఋజువుచేసుకోమని బాధించడం మొదలుపెట్టింది. నిజాని కిందులో ఒకర్ని ఒకరు తిట్టుకున్నారని కాదు కాని, అసలు అట్లాంటి పరిస్థితికి ఎవరు కారకులై ఉంటారా అన్నది నాకు పెద్ద సందేహమైపోయింది!.

అప్పటినుంచీ వాడితో ఎప్పుడు మాట్లాడినా వాడ్ని జాగ్రత్తగా పరిశీలించడం మొదలుపెట్టా. వాడెప్పుడూ తన

ఇంటి సొదను గురించి నాదగ్గర తేలేదు. ఆమె అంత ఏడిపించేదైతే, ఎప్పుడైనా ఏ విషయంమీదనైన, కాస్త కాకపోతే కాస్తయినా ఆమెపై ఉన్న అసహ్యమైన భావాన్ని వ్యక్తం చెయ్యకుండా ఉంటాడా అని నా అంతరాత్మ బాధించడం మొదలుపెట్టింది. కనీసం ఆమెను కాకపోయినా మిగతా ఆడజాతినైన ఆ బాధతో తిట్టకుండా ఉంటాడా అని!

ఓ రోజున నేనే ఏదో సందర్భంలో, 'మా ఆవిడ, మీ ఇందిర చాల మంచిదని చెప్పిందోయ్. అట్లాంటి మర్యాద ఆమె మా ఇంటికివస్తే తను చెయ్యలేనని కూడ చెప్పింది. అని చెప్పిచూశా. ఇట్లాంటి మర్యాద మీకూ మీకే గాని, నాకేం చెయ్యదులే అనేమైనా అంటాడేమో నని. కాని ఆతని దగ్గరనుంచి ఓ చిన్ని కనిపించీ కనిపించని నవ్వు తప్ప మరేమీ జవాబుగా పొందలేక. పోయాను.

మరోరోజున, 'అబ్బబ్బ! ఈ ఆడవాళ్ళతో చచ్చిన చావోయ్. వేగలేక పోతున్నాను. ఇంటికి వెళ్ళితే యమయాతన ననుకో. నిజంగా అనుకూల దాంపత్యానికి ఎంత పెట్టి పుట్టాలి! నువ్వు నయం రా. హాయిగా ఏ గొడవ లేకుండా ఉంటావు. దేనికైనా ఆ మాత్రం అర్థం చేసుకోగల భార్య ఉండటం నిజంగా భర్తనే ప్రాణికి ఎంత సుఖం!' అన్నా. ఇప్పుడైనా, 'ఆ...అ. అందరాడవాళ్ళూ ఒక్కటే లేవోయ్' అనేమైనా అంటాడేమో నని. కాని, అబ్బే.....వాడి నోటివెంట అట్లాంటిమాట రానిదే. మళ్ళీ మునుపటిలాగే ఓ నవ్వు బహు

తమాషగా నవ్వేసి ఊరుకున్నాడు. ఇంతగుట్టుగా ఉండే వాడి దగ్గఱ ఇకా విషయం గ్రహించడం ఎట్లాగో నా మనసు ఊహించలేక పోయింది.

ఇట్లా ఉండగా ఓ రోజున బాబూరావు మా ఇంటికి వచ్చాడు. వచ్చీరాగానే భయంకరం! ఇవ్వాళ చూశావా గూడ్సుబండీని ఢీకొని ప్యాసెంజరు బండి ముక్కముక్కలై పోయింది. ఎంతమంది చచ్చిపోయారో లెఖ్ఖలేదు అన్నాడు.

నేనా భయంకరమైన దృశ్యాన్ని చూచి అప్పుడే ఇంటికి వచ్చాను. 'అవును పాపం! చాలమంది చచ్చిపోయారు. ఒక్క మనిషిచేసే చిన్ని పొరపాటుకు ఎంతమంది ఆహుతి కావలసి వస్తూందో! అన్నా. ఇది వింటూనే బాబూరావు, 'ఇవ్వాళ నారాయణరావు పూనా ప్రయాణం. వాడ్ని ప్రక్క స్టేషనుకు తీసుకపోయి—ఎక్కించి వస్తున్నా. నిజానికి వాడి గుండెలు పీచుపీచు మంటూనే ఉన్నాయి. వాడితో అన్ని రైళ్ళూ గుద్దుకోవు లేరా. అపాయాలు వచ్చేముందు కొన్ని బళ్ళకు సర్దుకోగల తాహతు ఉంటుందిలే అని చెప్పి ప్రయాణం ఆపుకోకుండా చేశాను!' అని వాడంటూ వుంటే నామనస్సులో ఇథమిత్థ మనరాని భావమేదో కలిగి చప్పున బయటనుంచి పాలవాడు వేసే కేకతో అణగారి పోయింది.

పాలవాడి కివ్వవలసిన దేదో నేను పర్సుతీసి ఇస్తూ వుండగా బాబూరావు, 'అబ్బ! ఈ పర్సు నీ దగ్గఱ ఇంకా

వుందిరా? మెడ్రాస్‌లో మనిద్దఱమూ ఆ రోజున ఒకే రకం పర్సులు కొన్నాము. నా పర్సు మా చుట్టం ఒకాయన కాజేసాడు. నీకు వీలుగా ఉంటే ఇది నాకిచ్చేద్దూ అన్నాడు ఏక బిగిని.

వాడిలాంటివడగటమూ, నే నివ్వక పోవడం ఎప్పుడూ జరగదు కాబట్టి, 'ఏం నీ కంతగా కావలసి వస్తే తీసుకో' అన్నా. వాడు చప్పున 'Thanks రా' అంటూ దాన్ని అందుకున్నాడు. ఆ తరువాత ఇప్పుడు నాకు కాస్త పనొచ్చింది. ఓ యాభై రూపాయిలుంటే ఇలాఇయ్యి. రేపు ప్రొద్దున్నే ఇచ్చేస్తాను' అన్నాడు. ఇట్లా వాడెప్పుడూ ఎవ్వరినీ డబ్బడిగిన పాపాన పోలేదు. అట్టి ఛాన్సు నాకు రావడం నా అదృష్టంలా భావించుకొని, 'ఓ తప్పకుండా' అంటూ ఆ యాభై ఇచ్చి వాడ్ని పంపించాను. ఇక నే నారోజంతా వాడికి డబ్బెందుకు కావలసివచ్చిందా అనే ఆలోచించాను.

ఆ మరునాడే వాడా డబ్బు తీసుకొచ్చి నాకిచ్చేసాడు. 'అరే అప్పుడే ఇచ్చేసేవేం' అన్నా ఇలా అనడం భావ్యం కాబట్టి. ఎందుకనో వాడింత త్వరగా బాకీ తీర్చివేయడం నా మనస్సుకు తృప్తినీయలేదు. బాకీ ఉన్నవాడు గొప్పవాడైతే అట్లాగే ఉంటుంది మరి!

ఆతరువాత వాడూ నేనూ ఎప్పుడో కాని కలవడం పడలేదు. అది వాళ్ళింటి దగ్గతే జరిగింది. మేమిద్దఱమూ మాట్లాడుతూ వుండగా వాళ్ళావిడ నవ్వుతూ వచ్చి కాఫీ

ఇచ్చింది. నా మనసులో అప్పుడేవేవో విషయాలు గింజు కున్నాయి. అంత సుప్రసన్నమైన వదనంలోంచి చస్తే ఎప్పుడూ అట్లాంటి మాట రాదని నా మనసులోని మనసు ఘాటుగా చెప్పింది.

ఇంతలో నారాయణరావు పెద్దగోడవగా లోపలికి వచ్చాడు. పెద్ద బెడ్డింగూ అదీ రిక్షావాడు లోనికి తీసుక వచ్చాడు. 'అబ్బ! వెధవప్రయాణం. చావురా బాబూ. ఈ థర్డుక్లాసు ప్రయాణమంత ఛండాలం మరొకటిలేదు' అంటూ వాడు కుర్చీలో కూలబడ్డాడు. బాబూరావు 'ఏరా ఇన్నాళ్ళుండిపోయావేం? అప్పుడే వచ్చేస్తానన్నావ్? అంటూ పరామర్శించాడు. 'అబ్బో బోలెడంత గ్రంథం జరిగిందిలే. ముందు ఆ రిక్షావాడికి డబ్బులిచ్చేయ్' అన్నాడు. వెంటనే బాబూరావు పర్సుతీసి ఆ రిక్షావాడికి చల్లగా డబ్బులిచ్చి పంపించాడు. ఇంతలో నారాయణరావు బాబూరావు చేతిలోని ఆ ఫర్సు చూసి, 'అరే! నీకు మళ్ళీ ఈ ఫర్సు ఎట్లాదొరికింది. అదేనా ...ఆవేళ నా పూనా ప్రయాణంనాడు పారేసుకున్నావ్... అదేకదూ ఏదీ...ఇలా ఇయ్యి...... అవును అదే ... బలే లక్కీ ఫెలోవే... ఆ యాభైతోనే దొరికిందా? నీ కిలాంటి ఫర్సు కొని పంపాలని పూనాలో చాలా ప్రయత్నించాను. కాని ఇలాంటి దక్క డెక్కడా కనిపించలేదు. అయితే ఇంతకీ ఇది ఎలా దొరికింది?' అని వాడు ఏకబిగిని వాగేస్తూవుంటే బాబూరావు కాస్సేపు బిత్తరపుచూపులు చూస్తూ కూర్చుండి పోయాడు. నారాయణరావన్న మాటలు ఇల్లంతా ప్రతిధ్వనిం

చాయి. అయినా ఈ మాటలు ఈ దళసరి గోడలు దాటి ఎంతదూరం పోగలవో తెలుసుగోవటానికి ప్రయత్నిస్తూన్న ట్లుంది బాబూరావు మొఖం. బాబూరావు బాధ నిజంగా వర్ణనాతీతం. నావైపు వాడెంతో అమాయకంగా చూసాడు. అలాచూసి నారాయణరావుతో మెల్లగా, 'ఇది ఆవేళ అక్కడే ఆ కొట్టుదగ్గరే దొరికిందిరా' అన్నాడు. అప్పుడే ఇందిర నారాయణరావుకి కాఫీ తీసుకొచ్చింది. ఈ మాటలు ఆమె విన్నందుకు బాబూరావు మొగం తృప్తిని ప్రకటించింది. కాని ఇందిర నారాయణరావుతో 'ఏమో అన్నాయ్. అది నిజంగా పోయే వుంటుంది. ఈయన ఇంకొకటి కొని ఉంటారు' అంది. వెంటనే బాబూరావు 'ఛీ నోరుముయ్' అన్నాడు. ఆమె లోనికి వెళ్ళిపోయింది. నారాయణరావు పకపకా నవ్వుతూ, 'ఇది అలా దొరికేది కాదులే అమ్మాయ్'అంటూ అతనికి తెలియకుండానే ప్రాణం పోతూన్న బాబూరావుకు జీవంపోశాడు. కాని, బాబూరావు నాగురించి యమయాతన ననుభవిస్తున్నాడు. ఇక నేనక్కడ ఉండడం బాగుండదని, 'వస్తానంటూ' అక్కడనుంచి మెల్లగా బయిటపడ్డా.

నే నింటికి పోతూవుండగా బాబూరావును గురించి నా కనేకమైన విషయాలు తట్టాయి. ఇక అవన్నీ మీకుకూడ కలగడంలో ఏమాత్రం అనుమానం లేదు. కాని 'పాపం బాబూరా వెటువంటి నియంతృత్వపు బందిఖానాలో ఇరుక్కుపోయాడు!' అని మాత్రం మీరూ నేనూ అనుకోకతప్పదు.

——